


కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 48 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com | సోమవారం 06-07-2026



# తెలంగాణలో పెన్షన్ల స్కామ్‌కు చెక్
# 3 లక్షల మంది అర్హులకు కొత్తగా ఆసరా!

- తెలంగాణలో భారీ పెన్షన్ల కుంభకోణం గుర్తింపు
- లక్ష మంది అనర్హులు, మృతుల పేర్లతో డబ్బు డ్రా చేస్తున్నట్లు వెల్లడి
- అనర్హులను తొలగించి, వారి స్థానంలో కొత్తవారికి అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 3 లక్షల మందికి పెన్షన్ల మంజూరుకు నిర్ణయం
- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వ నిర్ణయంతో ఊరట



తెలంగాణలో అర్హులైన నిరుపేదలకు అండగా ఉండాల్సిన సామాజిక భద్రతా పెన్షన్ల వ్యవస్థలో ఏళ్లుగా జరుగుతున్న భారీ దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. సంక్షేమ ఫలాలు దుర్వినియోగం కాకుండా చూడాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో దిమ్మతిరిగే వాస్తవాలు వెలుగుచూశాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా అనర్హులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పెన్షన్లు పొందుతున్నట్లు అధికారికంగా నిర్ధారించారు. మరింత దారుణమైన విషయం ఏమిటంటే.. కొన్నేళ్ల క్రితం మరణించిన లబ్ధిదారుల పేర్లను జాబితా నుంచి తొలగించకుండా, వారి స్థానంలో కొందరు అక్రమార్కులు అధికారుల కళ్లుగప్పి నెలనెలా డబ్బులు డ్రా చేస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఈ భారీ అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను ఆయుధంగా ప్రయోగించింది. లబ్ధిదారులు జీవించి ఉన్నారో లేదో నిర్ధారించే 'లైఫ్ అథెంటికేషన్' ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా తప్పనిసరి చేయడంతో దొంగ పెన్షన్ల దందా బట్టబయలైంది. ఈ - మిగతా 2 లో

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టాం




- బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల జీవితాలు తాకట్టుపడ్డాయి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కన్నెపల్లి పంపు వద్ద కేటీఆర్ నాటకాలు చేస్తున్నారని మంత్రి ఎద్దేవా
- పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందన్న మంత్రి ఉత్తమ్
- తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఉత్తమ్ మండిపాటు
- రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టే కల్పించారు
- కాళేశ్వరం నిర్మాణ లోపాల వల్లే ప్రాజెక్టులు నిర్వీర్యమయ్యాయని వ్యాఖ్యలు



## కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు

- కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటనకు బయలుదేరిన కేటీఆర్
- జనగామ జిల్లా పెంబర్తి వద్ద కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు
- భారీ కాన్వాయ్‌కు అనుమతి లేదంటూ పోలీసుల అభ్యంతరం
- చర్చల తర్వాత కేటీఆర్ పర్యటనకు అనుమతి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌కు జనగామ జిల్లాలో పోలీసుల నుంచి అడ్డంకి ఎదురైంది. కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటనకు భారీ కాన్వాయ్‌తో బయలుదేరిన ఆయనను - మిగతా 2 లో

## గత సమావేశాల్లోని నిర్ణయాలు అమలు కావడం లేదు

- కేంద్రమంత్రులకు రేవంత్ మరోసారి లేఖలు
- హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్రమంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు
- గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్న సీఎం
- వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి



హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖలు రాశారు. గత నెలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదన్నారు. మెట్రో రైలుపై అధ్యయన బాధ్యతలు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించాలని సీఎం కోరారు. - మిగతా 2 లో

### అయోధ్య రామమందిర విరాళాల కేసులో
## దోషులకు కఠిన శిక్ష పడాలి



- ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్
- అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం కేసు
- బీజేపీ- ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు
- ప్రతిపక్ష నేతల్ని విచారించాలని డిమాండ్ చేస్తున్న వీహెచ్‌పీ

అయోధ్య రామ మందిర విరాళాల అవకతవకలపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన తీవ్రంగా ఖండించదగినదని, దోషులను కఠినంగా శిక్షించాలని ఈ సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే చేసిన ప్రకటననే ఆయన బలపరిచారు. ఇంతకు మించి అదనపు వ్యాఖ్యలు చేయడానికి ఆయన నిరాకరించారు. 'సన్మార్గ్ మైండ్ వెల్నెస్' ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా విలేకరులతో మాట్లాడిన - మిగతా 2 లో

### త్వరలో స్థానిక ఎన్నికలు వస్తున్నాయి
## అన్ని చోట్లా గెలవాల్సిందే

- కుప్పం నుంచి సీఎం చంద్రబాబు పిలుపు
- క్షేత్రస్థాయిలో పొలిటికల్ గవర్నెన్స్ అవసరమన్న చంద్రబాబు
- అధికారులు, పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు సూచన
- త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలవాలని పిలుపు
- పనితీరు ఆధారంగానే పార్టీలో పదవులు ఉంటాయని స్పష్టీకరణ

తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు, మూడో రోజు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా కార్యకర్తలు - మిగతా 2 లో


## ఖమేనీ శవపేటిక చూసి భోరున విలపించిన కుమారులు!


- ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో హతమైన ఇరాన్ అధినేత ఖమేనీ
- అంత్యక్రియల కోసం టెహ్రాన్ వీధుల్లోకి లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు
- అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మిన్నంటిన నినాదాలు
- కార్యక్రమాలకు దూరంగా కొత్త అధినేత మొజ్తబా ఖమేనీ
- యుద్ధం కారణంగా వాయిదా పడి ఇప్పుడు జరుగుతున్న కార్యక్రమాలు



అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హతమైన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు టెహ్రాన్‌లో కొనసాగుతున్నాయి. ఆదివారం లక్షలాది - మిగతా 2 లో


## విశాఖ మత్స్యకారుల గల్లంతు
## గాలింపు చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా





- విశాఖ నుంచి వేటకు వెళ్లిన 7గురు మత్స్యకారులు గల్లంతు
- గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- కోస్టుగార్డు, నేవీ నౌకలు, హెలికాప్టర్లతో గాలింపు
- సాంకేతిక లోపం వల్లే బోటు చిక్కుకుందని అధికారుల అనుమానం
- మత్స్యకారుల కుటుంబాలకు ధైర్యం చెప్పాలని మంత్రి, నేతలకు సీఎం సూచన

విశాఖ నుంచి చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులను ఆదేశించారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన, మత్స్యకారులు గల్లంతైన విషయం తెలియగానే ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి ఈ నెల 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు బోటులో ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారని అధికారులు సీఎంకు వివరించారు. 4వ తేదీ మధ్యాహ్నానికే వారు తిరిగి రావాల్సి ఉండగా, ఇప్పటికీ తీరానికి చేరలేదని తెలిపారు. గంగవరం సముద్ర తీరానికి సమీపంలో బోటులో సాంకేతిక లోపం తలెత్తినట్లు భావిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం కోస్టుగార్డు, నేవీ, మెరైన్ పోలీసు - మిగతా 2 లో




## బంగాళాఖాతంలో వాయుగుండం ఉత్తరాంధ్రకు భారీ వర్ష సూచన

- వాయుగుండంగా మారిన అల్పపీడనం
- ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరంలో కేంద్రీకృతం
- 24 గంటల్లో బాలాసోర్ వద్ద తీరం దాటే అవకాశం
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఈ వాయుగుండం ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర - మిగతా 2 లో

# రాష్ట్ర అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- మేం కష్టపడి ప్రాజెక్టులు తీసుకువస్తే, తామే తెచ్చినట్టు సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారు
- కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన
- మీడియా ప్రతినిధులతో చిట్ చాట్
- రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను తరిమికొట్టడమే వైసీపీ పని అంటూ విమర్శలు
- కూటమి తెచ్చిన ప్రాజెక్టులకు క్రెడిట్ కొట్టేస్తున్నారని ఆగ్రహం
- తమపై దుష్ప్రచారానికి సోషల్ మీడియాకు ఫండింగ్ చేస్తున్నారని ఆరోపణలు



రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను తరిమికొట్టడమే పనిగా పెట్టుకున్నారని, కూటమి ప్రభుత్వం ఎంతో కష్టపడి తెస్తున్న ప్రతి ప్రాజెక్టును తామే తెచ్చినట్లు సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా, ఇప్పుడు కూడా అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం వచ్చిన ఆయన, మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తనపైనా, పవన్ కల్యాణ్ పైనా నిరంతరం దుష్ప్రచారం చేసేందుకు కొన్ని సోషల్ మీడియా గ్రూపులకు 'గొడ్డలి పార్టీ' నేతలు ప్రత్యేకంగా నిధులు సమకూరుస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. హింస, అసభ్యత, వర్గవిభేదాలు, రౌడీయిజం వంటి వాటినే ఆ పార్టీ నమ్ముకుందని, వారి అడ్డంకులు ఎన్ని ఎదురైనా రాష్ట్రంలో అభివృద్ధి మాత్రం - మిగతా 2 లో


మనం
TELUGU DAILY
సోమవారం 06-07-2026

# 'అస్తిత్వ' అవస్థల్లో భారతీయులు!

భారతీయుడా, నీవు భారతీయ పౌరుడువేనా?! విడ్డూరమైన కాలమిది. కాకపోతే భారతీయ పౌరుడుగా గుర్తింపు విషయంలో భారతీయులు అయోమయంలో పడవలసిరావడమేమిటి? సగటు భారతీయుడు తన జాతీయత నిర్ధారణకు న్యాయబద్ధమైన ప్రమాణం ఏమిటో తెలుసుకోవడానికి ప్రయాసపడుతున్నాడు అతడికి దిశా నిర్దేశం చేయవలసిన అధికార వ్యవస్థ ఇప్పటి వరకు స్పష్టమైన విధి విధానాలు వెల్లడించలేదు. ఇది విచిత్ర సందర్భం కాదూ?ఒక దేశానికి సార్వభౌమాధికారం ఎంత ముఖ్యమో ఆ దేశవాసులకు జాతీయత, పౌరసత్వం ఉండడం కూడా అంతే ముఖ్యం. మన పొరుగు దేశాలు అయిన నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో అత్యంత వెనుకబడిన మారుమూల ప్రాంతాలలో సైతం పౌరసత్వం, జాతీయత విషయంలో స్పష్టమైన విధివిధానాలు అమలులో ఉన్నాయి. మరి భారత్‌లో ఆ ప్రాథమిక గుర్తింపుల విషయంలో ఒక కచ్చితమైన విధానం లేకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి ప్రామాణిక ధ్రువీకరణ కాదని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఆ పెద్దమనిషి ప్రకటన కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అసంఖ్యాకులను ఆందోళనకు గురిచేస్తోంది.చట్టాలు, అధికారిక నిబంధనల ప్రకారం పాస్‌పోర్ట్, పౌరసత్వం వేర్వేరు అంశాలే అయినప్పటికీ పరస్పర అనుసంధానం ఉన్న విషయాలు. దుబాయిలోని ప్రవాస భారతీయ కుటుంబాల నవజాత శిశువులకు తల్లిదండ్రుల పాస్‌పోర్ట్‌ల ఆధారంగా వారి జాతీయతను నిర్ధారించి, పౌరసత్వాన్ని నమోదు చేస్తారు. ఆ తరువాత మాత్రమే భారత విదేశాంగ శాఖ ఆ పసి ప్రాయులకు పాస్‌పోర్ట్‌లు జారీ చేస్తుంది. ఉదాహరణకు బహ్రెయిన్‌లో, తెలంగాణలోని కామారెడ్డి జిల్లాకు చెందిన ప్రవాస దంపతులకు జన్మించిన ఒక బాలిక జననాన్ని నిర్దిష్ట కాలంలో నమోదు చేయకపోవడంతో అమె భారతీయ పౌరసత్వాన్ని భారత ప్రభుత్వం గుర్తించలేదు. తత్కారణంగా అమెకు పాస్‌పోర్ట్ జారీలో జాప్యం జరిగి, స్వదేశానికి తిరిగి వెళ్ళడంలో ఆ చిన్నారికి సమస్యలు సంభవించాయి. జాతీయతను నిర్ధారించుకున్న తరువాతనే పౌరసత్వాన్ని నమోదు చేసి, పాస్‌పోర్ట్ జారీ చేసే విధానమే ప్రపంచమంతటా అమలులో ఉన్నది. భారత్‌లో సైతం దరఖాస్తుదారుడు భారతీయుడు అని నిర్ధారించుకున్న తర్వాతే పాస్‌పోర్ట్‌ను జారీ చేస్తారు. ఈ నేపథ్యంలో పౌరసత్వానికి పాస్‌పోర్ట్ ప్రమాణం కాదని విదేశాంగ శాఖ అనడం సువిశాల భారతీయ సమాజాన్ని సందిగ్ధావస్థలో పడవేసింది. సమస్త ధ్రువీకరణలలో పాస్‌పోర్ట్‌ను అత్యున్నత విశ్వసనీయ అధికారిక పత్రంగా భావిస్తారు. ఇది, దేశ జనాభాలో కేవలం 6.5శాతం మంది వద్ద మాత్రమే ఉన్నది. అయినప్పటికీ పాస్‌పోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం సహజంగానే అసంఖ్యాకులను ఉలికిపాటుకు గురిచేసింది.జాతీయతను జాతీయ పౌరసత్వ నమోదు (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్-- ఎన్ఆర్‌సీ) ద్వారా నిర్ధారిస్తారు. ఇందుకు జాతీయ జననాల నమోదు అవసరం. దురదృష్టవశాత్తు రాజకీయ పార్టీల స్వార్థ ప్రయోజనాల కారణంగా ఈ ప్రక్రియ 2003 వరకు అస్తవ్యస్తంగా కొనసాగింది. కేంద్ర హోం శాఖ పరిధిలోని ఈ అంశాన్ని దాని పక్షాన స్థానిక సంస్థలు నిర్వహిస్తాయి. స్థానిక స్వపరిపాలనా సంస్థలలోని ప్రజాప్రతినిధులు ఎప్పుడూ, ఎక్కడా కూడ ఈ విషయమై ప్రజలలో అవగాహన కల్పించలేదు. ప్రభుత్వాలూ సరిగా పట్టించుకోలేదు. జననాల నమోదులో చోటుచేసుకున్న అలసత్వానికి ప్రజల కంటే పాలకులే ప్రథమ దోషులు అని చెప్పక తప్పదు.అయితే రెండు దశాబ్దాల క్రితం ఈ శోచనీయ పరిస్థితి మారింది. నాటి నుంచి జననాల నమోదు క్రమబద్ధంగా జరుగుతోంది. ప్రస్తుత యువతరంలో అత్యధికుల జననం అధికారికంగా నమోదయి ఉంది. అయితే వారి తల్లిదండ్రుల జననాల విషయంలో మాత్రం స్పష్టత లేదు. 1987కు ముందు జన్మించిన వారికి జనన సర్టిఫికెట్లు అవసరం లేదని ప్రభుత్వం చెబుతున్నది. 2004 అనంతరం జన్మించిన వారి జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు తల్లిదండ్రుల సర్టిఫికెట్లను సైతం అడుగుతోంది. దీంతో పరిస్థితి సంక్లిష్టమవుతోంది.గ్రామీణ ప్రాంతాలలోని బడుగువర్గాలలో, ప్రత్యేకించి బాలికల అక్షరాస్యత ఇప్పటికీ అంతంతమాత్రమే. ఈ పరిస్థితుల్లో జననాల ధ్రువీకరణ పత్రాలు ఉండడం అంత సులభతరం కాదు. జననల నమోదు సక్రమంగా జరిగి ఉంటే జాతీయత, పౌరసత్వం ఉనికికి సంబంధించి అయోమయ పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదు. 1945లో న్యూఢిల్లీలో జన్మించిన పాకిస్థాన్ సైనిక పాలకుడు జనరల్ జనరల్ పర్వేజ్ ముషారఫ్ జనన సర్టిఫికెట్ లభించినంత సులువుగా అసలు సిసలైన భారతీయుల జనన సర్టిఫికెట్లు లభించవనేది అందరికీ తెలిసిన విషయమే. అక్షరాస్యత లేని ఆఫ్రికా ఆటవీ ప్రాంతాలలోను, అరేబియా ఎడారి కుగ్రామాల ఇసుక దిబ్బలలో గుడారాలలో నివసించె వెనుకబడ్డ తెగల ప్రజల జననాలు, మరణాలు కచ్చితమైన వివరాలతో నమోదవుతున్నాయి. మరి ఈ విషయంలో భారత్ ఎందుకు విఫలమయింది? ఆత్మపరిశీలన చేసుకోవాలి.

# రాష్ట్ర అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు

**మొదటిపేజీ తరువాయి -** ఆగదని స్పష్టం చేశారు.కుప్పం నియోజకవర్గానికి మునుపెన్నడూ చూడని రీతిలో ప్రాజెక్టులు వస్తున్నాయని, రోడ్లు, కమ్యూనికేషన్ సహా అన్ని రంగాల్లో కనెక్టివిటీ పెంచుతున్నామని తెలిపారు. త్వరలోనే అభివృద్ధి చెందిన సరికొత్త కుప్పాన్ని ప్రజలు చూస్తారని భరోసా ఇచ్చారు. వికేంద్రీకృత అభివృద్ధి విధానంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రానికి క్వాంటం, సెమీ కండక్టర్ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం వివరించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరావతిలో 'క్వాంటం కంప్యూటింగ్ సెంటర్' కార్యకలాపాలు



ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. ఇంధన రంగంలో సౌర, పవన విద్యుత్‌తో పాటు ఇతర అత్యాధునిక విధానాలను అమలు చేస్తున్నామన్నారు. దేశంలోని ప్రముఖ ఉక్కు పరిశ్రమలైన ఆర్సెలర్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఏపీలో తమ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నాయని గుర్తుచేశారు. పరిశ్రమలతో పాటు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.గత పాలకులు విలువైన భూములు, ఖనిజ సంపదను ఒకే వ్యక్తి ప్రయోజనం కోసం కట్టబెట్టారని, ఏజెన్సీ ప్రాంతాలను గంజాయి సాగుకు కేంద్రంగా మార్చారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తిరుమల ప్రసాదాన్ని సైతం కల్తీ చేశారని, అలాంటి వారు ఇప్పుడు నీతులు చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో పెన్షన్ల స్కామ్‌కు చెక్
## 3 లక్షల మంది అర్హులకు కొత్తగా ఆసరా!

**మొదటిపేజీ తరువాయి -** డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా మరణించిన వారి వివరాలు, ఇతర అనర్హుల సమాచారం స్పష్టంగా వెల్లడైంది. దీంతో తక్షణమే స్పందించిన ఉన్నతాధికారులు, గుర్తించిన లక్ష మంది అనర్హుల పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి శాశ్వతంగా తొలగించాలని తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్షాళనతో ప్రభుత్వ ఖజానాకు ప్రతి నెలా వృథాగా పోతున్న కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా కానుంది.అయితే, అనర్హుల తొలగింపు ద్వారా మిగిలే నిధులను నిజమైన లబ్ధిదారులకే అందించాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షల మంది అర్హులకు పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రక్రియ కొనసాగుతుండగా, దానికి అదనంగా తాజాగా గుర్తించిన లక్ష మంది అనర్హుల స్థానంలో మరో లక్ష మంది కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. దీంతో రాష్ట్రంలో మొత్తం 3 లక్షల మంది నిరుపేదలకు కొత్తగా ఆర్థిక భద్రత లభించనుంది. ఇందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు, నిధుల సర్దుబాటుపై రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం.ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, దివ్యాంగుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. ప్రస్తుతం గ్రామ, వార్డు స్థాయిల్లో అర్హులను గుర్తించే సర్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అర్హుల వడపోత ప్రక్రియ తుది దశకు చేరుకుందని, త్వరలోనే లబ్ధిదారుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేసి, కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సచివాలయ ఉన్నత వర్గాలు వెల్లడించాయి.

## కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు



**మొదటిపేజీ తరువాయి -** పెంబర్తి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆదివారం మధ్యాహ్నం కేటీఆర్ తన పర్యటనలో భాగంగా భారీ సంఖ్యలో వాహనాలతో కూడిన కాన్వాయ్‌తో కన్నెపల్లికి బయలుదేరారు. అయితే, ఇంత పెద్ద కాన్వాయ్‌కు అనుమతి లేదని పోలీసులు పెంబర్తి వద్ద వాహనాలను నిలిపివేశారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.ఈ క్రమంలో కేటీఆర్ జోక్యం చేసుకుని, తన కాన్వాయ్‌లోని అన్ని వాహనాలను అనుమతించాల్సిందేనని పట్టుబట్టారు. కాన్వాయ్‌ను నిలిపివేయడంపై ఆయన పోలీసు అధికారులతో మాట్లాడారు. కొద్దిసేపటి చర్చల తర్వాత పోలీసులు వెనక్కి తగ్గడంతో, కేటీఆర్ కాన్వాయ్ యథావిధిగా కన్నెపల్లి పంప్‌హౌస్ వైపు తన పర్యటనను కొనసాగించింది.

# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టాం

**మొదటిపేజీ తరువాయి -** పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. అధిక శాతం లోన్లు తీసుకొచ్చి బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. రూ. 1.81లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. తాము అధికారంలో వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వివరించారు. ఉల్టా చోర్ కొత్వాల్‌కు దండే అన్నట్లుగా బీఆర్ఎస్ నేతల తీరు ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేకపోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేకపోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి తుమ్మిడిహెట్టి వద్ద



ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది గులాబీ పార్టీనే అని ఆగ్రహించారు. కాంగ్రెస్‌కి మంచి పేరు వస్తుందనే కారణంతో తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకి డిజైన్ మార్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు.

# విశాఖ మత్స్యకారుల గల్లంతు
# గాలింపు చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా

**మొదటిపేజీ తరువాయి -** విభాగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయని, ఈ ఉదయం నుంచి నౌకాదళ హెలికాప్టర్‌ను కూడా రంగంలోకి దించినట్లు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, గాలింపు చర్యలను సమన్వయం చేసుకోవాలని మెరైన్ ఐజీ, విశాఖ సీపీలకు సూచించారు. ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశించారు. అదే సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు ధైర్యం చెప్పి అండగా నిలవాలని మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు.

# అయోధ్య రామమందిర విరాళాల కేసులో దోషులకు కఠిన శిక్ష పడాలి

**మొదటిపేజీ తరువాయి -** ఆయన, ఒక రోజు క్రితం ఆర్ఎస్ఎస్ విడుదల చేసిన అధికారిక ప్రకటనను చూడాలని కోరారు.శుక్రవారం హోసబలే మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "తరాల పోరాటాలు, కోట్ల మంది రామభక్తుల అంకిత భావం, త్యాగం, బలిదానాల వల్ల శ్రీరామ జన్మభూమిపై నిర్మించిన ఈ అద్భుత ఆలయం యావత్ హిందూ సమాజానికి భక్తి, శ్రద్ధ, విశ్వాసాలకు కేంద్రంగా మారింది. అయితే ఈ అయోధ్య రామమందిరంలో ఉంచిన విరాళాల దొంగతనం ఒక దురదృష్టకర ఘటన. ఇది మొత్తం సమాజం, రామభక్తుల మనోభావాలను, భక్తిని గాయపరిచింది. మనందరినీ ఎంతగానో గాయపరిచింది. ఇది తీవ్రంగా ఖండించదగినది. కనుక దర్యాప్తులో దోషులుగా తేలిన ఎవరికైనా కఠినమైన శిక్ష పడేలా చూడడం అత్యవసరం" అని అన్నారు.మరోవైపు అయోధ్య రామ మందిరం విరాళాల దుర్వినియోగం ఆరోపణల కేసు రాజకీయంగా మరింత వేడెక్కుతోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ తాజాగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. మరోవైపు విశ్వ హిందూ పరిషత్ (ఎవూ) ప్రతిపక్ష నేతలు చేసిన ఆరోపణలపైనా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. దీంతో ఈ కేసు రాజకీయంగా కొత్త మలుపు తిరిగింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆదివారం రోజు మీడియాతో మాట్లాడుతూ బీజేపీపై విరుచుకుపడ్డారు. బీజేపీ రాజకీయ వ్యూహం ఇప్పుడు 'ఓటు చోరీ, సీటు చోరీ, చందా చోరీ' గా మారిందని విమర్శించారు. అయోధ్య రామ మందిరం కోసం భక్తులు సమర్పించిన వేల కోట్ల రూపాయల విరాళాల్లో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటివరకు స్పందించకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు.రామ మందిరం నిర్మాణానికి రాజకీయంగా క్రెడిట్ తీసుకున్న నాయకులు ఇప్పుడు ఈ ఆరోపణలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ' రామ మందిరం నిర్మాణం, అలాగే 2024 జనవరి 22న రామ మందిరం ప్రారంభోత్సవ ఘనతను తమ ఖాతాలో వేసుకున్న ప్రధాన మంత్రి- ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్యను కోల్పోయినప్పటికీ- దీనిపై ఏదైనా ప్రకటన చేస్తారని మేం ఆశిస్తున్నాం. కానీ వారు పూర్తిగా మౌనంగానే ఉన్నారు.' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఈ కేసును సిట్టింగ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ 'చందా దో.. ధందా లో' అనే విధానమే బీజేపీ రాజకీయ సంస్కృతిలో భాగమని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని సుప్రీం కోర్టు రద్దు చేసిందని, విరాళాల రాజకీయాలు బీజేపీ డీఎన్ఏలో భాగమని ఆయన ఆరోపించారు.ఇక ఇదే సమయంలో విశ్వ హిందూ పరిషత్ (ఎవూ) అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ మరో కీలక డిమాండ్ చేశారు. రామ మందిరం విరాళాల దుర్వినియోగం కేసుపై బహిరంగంగా ఆరోపణలు చేసిన ప్రతిపక్ష నేతల్ని కూడా దర్యాప్తు అధికారులు విచారించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, సమాజ్ వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ యాదవ్ చేసిన వ్యాఖ్యల నిజానిజాల్ని పరిశీలించాలని సూచించారు. ఈ నేతలు తమ ఆరోపణలకు తగిన ఆధారాలు సమర్పిస్తే వాటిని దర్యాప్తులో భాగంగా పరిగణించాలని, ఆధారాలు లేకుండా ప్రజల్ని తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేసి ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలని అలోక్ కుమార్ తన లేఖలో పేర్కొన్నారు.ఈ కేసులో యూపీ సర్కార్ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను కొనసాగిస్తోంది. సిట్ ప్రాథమిక నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఆరుగురి వద్ద నుంచి సుమారు రూ. 80 లక్షల వరకు నగదు, కొంత విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా ఇప్పటికే తమ పదవులకు రాజీనామాలు చేశారు. కేసుపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు మహంత్ దినేంద్ర దాస్ మహారాజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి దోషులెవరైనా కఠినంగా శిక్షించాలని అన్నారు. రామ మందిరం విరాళాల దుర్వినియోగం అత్యంత తీవ్రమైన నేరమని పేర్కొన్న ఆయన, ఆలయంలో పూజా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతున్నాయన్నారు. విరాళాల నిర్వహణలో పారదర్శకతను మరింత బలోపేతం చేశామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, రాజకీయ ఆరోపణలు-ప్రత్యారోపణలు మరింత వేడెక్కుతున్నాయి.

# బంగాళాఖాతంలో వాయుగుండం
# ఉత్తరాంధ్రకు భారీ వర్ష సూచన

**మొదటిపేజీ తరువాయి -** విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం ఇది ఒడిశాలోని బాలాసోర్‌కు 50 కిలోమీటర్ల దూరంలో, చాంద్‌బలి, దిఘాలకు చెరో 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు తెలిపారు.ఈ వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రానున్న 24 గంటల్లో చాంద్‌బలి-దిఘా మధ్య బాలాసోర్ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలోని ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ పేర్కొంది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది.ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాయుగుండం కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

# త్వరలో స్థానిక ఎన్నికలు వస్తున్నాయి
# అన్ని చోట్లా గెలవాల్సిందే

**మొదటిపేజీ తరువాయి -** వ్యవహరించాల్సిన తీరుపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. పై స్థాయిలోనే కాకుండా క్షేత్ర స్థాయిలో కూడా పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలని, అప్పుడే నిజమైన సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.శనివారం కుప్పంలో పర్యటనలో భాగంగా రైతులు, పీ4 లబ్దిదారులు, అధికారులతో వరుస భేటీలు నిర్వహించిన అనంతరం, ఆయన నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, జిల్లా అధ్యక్షుడు షణ్ముఖ రెడ్డితో పాటు ముఖ్య నేతలు హాజరయ్యారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ యంత్రాంగం, ప్రభుత్వ అధికారులు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను అధికారులకు వివరించి, ప్రజా సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పేదల పక్షాన నిలిచే టీడీపీ నేతలు, కార్యకర్తలకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలవాలని, వారిని గౌరవించాలని అన్నారు.గత ఐదేళ్ల పాలన (2019-24) రాష్ట్రానికి ఒక పీడకల వంటిదని, ఆ సమయంలో కుప్పం నియోజకవర్గంలో కూడా ప్రశాంతతను దెబ్బతీయాలని నాటి పాలకులు విఫలయత్నం చేశారని చంద్రబాబు విమర్శించారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, కుప్పంలో ఎవరైనా రౌడీయిజం చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, వాటన్నింటిలోనూ టీడీపీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులే గెలవాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు సహా స్థానిక సంస్థలన్నింటినీ కూటమే కైవసం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం కార్యకర్తలకు సమాజంలో మంచి పేరు, గుర్తింపు ఉందని, దానికి భంగం కలిగేలా ఎవరూ ప్రవర్తించకూడదని హితవు పలికారు.పార్టీలో పదవుల కేటాయింపుపై కూడా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై పనితీరు ఆధారంగానే పదవులు ఉంటాయని, నియామకాల్లో ఎలాంటి మొహమాటాలకు, సిఫారసులకు తావుండదని తేల్చిచెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోమని భరోసా ఇచ్చారు. బూత్ స్థాయి నుంచి ఏ పదవికైనా కార్యకర్తల ఆమోదం తప్పనిసరి అని స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చి, గతంలో కంటే మెరుగైన మెజారిటీ సాధించేలా ఇప్పటి నుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యకర్తల ఆర్థిక సాధికారతకు పార్టీ కృషి చేస్తుందని, "ఇంటికో పారిశ్రామికవేత్త" విధానాన్ని పార్టీ కార్యకర్తలు కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అందరి ఆమోదంతో త్వరలోనే కుప్పంలో ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

## ఖమేనీ శవపేటిక చూసి భోరున విలపించిన కుమారులు!

**మొదటిపేజీ తరువాయి -** మంది ప్రజలు టెహ్రాన్ వీధుల్లోకి, గ్రాండ్ మొసల్లా కాంప్లెక్స్‌లోకి తరలివచ్చి తమ ప్రియతమ నేతకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా "డెత్ టు అమెరికా", "డెత్ టు ఇజ్రాయెల్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని ప్రదర్శించారు. జులై 4న ప్రారంభమైన ఈ అంత్యక్రియల కార్యక్రమాలు ఆరు రోజుల పాటు కొనసాగి, జులై 9న మషద్‌లో ఖననంతో ముగుస్తాయి. టెహ్రాన్‌లో జరిగిన ప్రార్థనల్లో ఖమేనీ ముగ్గురు కుమారులు మొస్తఫా, మీసమ్, మసౌద్‌తో



పాటు ఉన్నతాధికారులు, సైనిక ప్రముఖులు పాల్గొన్నారు. తండ్రి శవపేటికను చూసి కుమారులు కన్నీటిపర్యంతమయ్యారు.36 ఏళ్లు ఇరాన్‌ను పాలించిన ఖమేనీ, ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్ యుద్ధంలో జరిగిన తొలి దాడుల్లో తన కుటుంబ సభ్యులతో సహా హతమయ్యారు. యుద్ధం కారణంగా మార్చిలో జరగాల్సిన ఈ కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం అమలవుతున్న కాల్పుల విరమణ నేపథ్యంలో వీటిని తిరిగి ప్రారంభించారు.అయితే, ఖమేనీ రెండో కుమారుడు, ఆయన తర్వాత ఇరాన్ మూడో సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ఈ కార్యక్రమాలకు హాజరుకాలేదు. ఫిబ్రవరిలో జరిగిన దాడుల్లో ఆయన గాయపడినట్లు, భద్రతా కారణాల దృష్ట్యా ఆయన బయటకు రావడం లేదని తెలుస్తోంది. ఇజ్రాయెల్ మళ్లీ దాడి చేయవచ్చనే ఆందోళనల నడుమ ఆయన కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారు.ఈ అంత్యక్రియలు ఇస్లామిక్ రిపబ్లిక్ పాలన కొనసాగింపును, ఐక్యతను చాటే రాజకీయ ప్రదర్శన అని విశ్లేషకులు భావిస్తున్నారు. పటిష్ఠ భద్రత నడుమ జరుగుతున్న ఈ కార్యక్రమాలకు పలు దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. రానున్న రోజుల్లో మరిన్ని ఊరేగింపుల తర్వాత మషద్‌లోని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో ఖమేనీ భౌతిక కాయాన్ని ఖననం చేయనున్నారు.

## గత సమావేశాల్లోని నిర్ణయాలు అమలు కావడం లేదు

**మొదటిపేజీ తరువాయి -** షరతులు, విధివిధానాలు వెంటనే ఖరారు చేయాలన్నారు. మెట్రో మొదటి దశ టేకోవర్, రెండో దశ అనుమతులు జాప్యం అవుతున్నాయని, వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి లేఖల్లో కోరారు.ఇటీవలే కేంద్రమంత్రులతో భేటీ అయిన సీఎం : మెట్రో



రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే పలుమార్లు లేఖలు రాశారు. తెలంగాణలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొద్దిరోజుల క్రితమే దిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై విస్తృతంగా చర్చించారు.తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మెట్రో రైలు విస్తరణను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనికి కేంద్రం సహాయం అవసరమని సీఎం వివరించినట్టు సమాచారం. మెట్రో విస్తరణకు నోచుకోకపోవడంతో హైదరాబాద్‌లో నగరంలో ఎదురవుతున్న ఇబ్బందులను కేంద్రమంత్రి దృష్టికి రేవంత్ తీసుకెళ్లారు. విస్తరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పిన సీఎం, దీనికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రావాల్సిన రుణాన్ని త్వరగా విడుదలయ్యేలా చొరవ చూపాలని కోరారు.భేటీ సందర్భంగా ఈ ప్రాజెక్టు చుట్టూ ఏర్పడిన రాజకీయ అంశాలు సైతం చర్చకు వచ్చినట్లు తెలిసింది. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మెట్రో రెండో దశ అనుమతులపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించిన పలు అంశాలపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. అయితే మెట్రో అంశం రైల్వే శాఖ పరిధిలోనిది కానందున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో తాను మాట్లాడతానని హామీ ఇవ్వడంతో పాటు వెంటనే ఆ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

# కోసిగి నుంచి బిగ్ సిగ్నల్ మంత్రాలయం టీడీపీ ఇంచార్జి గారి నాయకత్వాన్ని విశ్వసించిన ప్రముఖ కుటుంబం







**కోసిగి,జూలై,05,ప్రభ మనం** నియోజకవర్గ రాజకీయాల్లో కోసిగి టౌన్ కోసిగికి చెందిన నాడిగినేని రంగన్న గారి కుటుంబం ఇప్పటివరకు మరో వర్గంలో కొనసాగుతున్న దాదాపు 100 మందికి పైగా కుటుంబ సభ్యులు,కార్యకర్తలు మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి శ్రీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గారి సమక్షంలో ఇంచార్జి గారి నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు..ఈ సందర్భంగా వారిని ఆప్యాయంగా ఆహ్వానించిన రాఘవేంద్ర రెడ్డి గారు మాట్లాడుతూ "ఇక్కడ నుంచి ఎవరి వర్గం అనేది కాదు ఇకపై మనందరం తెలుగుదేశం పార్టీ కుటుంబం.ప్రతి కార్యకర్తకు అండగా, ప్రజలకు తోడుగా కలిసి ముందుకు సాగుదాం. ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన ప్రాధాన్యం ఉంటుంది" అని భరోసా ఇచ్చారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయధంకా మోగించాలి.అదే ఉత్సాహంతో 2029లో మంత్రాలయం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేసి విజయాన్ని సాధించి మరోసారి మన నారా చంద్రబాబు గారిని ముఖ్యమంత్రి గా చేస్కోవడం మన అందరి లక్ష్యం అంటూ మాట్లాడటం జరిగింది.. ఈ కార్యక్రమంలో నాడిగినేని నర్సమ్మ, మహాదేవ, నర్సిరెడ్డి, నాగరాజు, అంజిని రెడ్డి, లక్ష్మికాంత్, రాజు, రామాంజినేయులు, వీరేష్ మరియు తదితరులు పాల్గొన్నారు..

# టీడీపీ ఇన్చార్జ్ వర్గంలోకి తిక్కారెడ్డి వర్గం చేరిక



**మంత్రాలయం , జూలై 5,మనం న్యూస్ ;-** మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి వర్గంలోకి కర్నూలు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షులు తిక్కారెడ్డి వర్గం ఆదివారం చేరారు. కోసిగి పట్టణానికి చెందిన నాడిగినేని రంగన్న కుటుంబం తో సహ దాదాపు 100 మందికి పైగా కార్యకర్తలు మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి సమక్షంలో ఇంచార్జి నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు.అనంతరం వారిని టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆప్యాయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నుంచి మంత్రాలయం నియోజకవర్గంలో ఎవరి వర్గం అనేది కాదు ఇకపై మనందరం తెలుగుదేశం పార్టీ కుటుంబమే అన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా, ప్రజలకు తోడుగా కలిసి ముందుకు సాగుదామని. ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన ప్రాధాన్యం ఉంటుంది" అని భరోసా ఇచ్చారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయధంకా మోగించాలన్నారు...అదే ఉత్సాహంతో 2029లో మంత్రాలయం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాడిగినేని నర్సమ్మ, మహాదేవ, నర్సిరెడ్డి, నాగరాజు, అంజిని రెడ్డి, లక్ష్మికాంత్, రాజు, రామాంజినేయులు, వీరేష్ మరియు తదితరులు పాల్గొన్నారు..

# ఆదర్శ ఉపాధ్యాయుడికి సన్మానం





వనపర్తి బ్యూరో **జూలై 05 ప్రభ మనం:** జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా 36 సంవత్సరాలు ఉద్యోగ విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ చేసిన ఆదర్శ ఉపాధ్యాయుడు నరహరి నాగేశ్వరరెడ్డిని సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఆదివారం నంద్యాలలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ చక్కని ఉపాధ్యాయుడిగ విద్యార్థులకు పాఠ్య బోధన చేసి పాఠశాలలకు తన సొంత డబ్బులతో వసతులు సమకూర్చారని ,వనపర్తి జిల్లాతో నాగేశ్వరరెడ్డికి మంచి అనుబంధం ఉందని కొనియాడారు.ఇక్కడి కొందరి రచయితలకు,సాహితీ వేత్తలకు ఆర్థిక పరమైన చేయుతనందించారని శంకర్ గౌడ్ తెలిపారు.కళావేదిక సభ్యులు నాగేశ్వర రెడ్డిని శాలువ జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈనాటి కార్యక్రమంలో సాహితీ వేత్తలు బైరోజు చంద్ర శేఖర్,డా.బి.శ్యాం సుందర్,బి. రాజశేఖర్ ,మధు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ



ప్రతినిధి **జూలై 05 ప్రభ మనం:** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా శినివారం వనపర్తి పట్టణంలోని మాదిగ కుల సంఘం వారితో సమావేశం ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణం కోసం స్థల సేకరణ ఏర్పాటు ఈ సమావేశాన్ని వనపర్తి పట్టణం కర్రెమ్మ గుడి వద్ద ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త ,నాయకులు గంధం గట్టయ్య మాదిగ ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ,ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ అవశ్యకతను వివరించడం జరిగింది. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు 30 ఏండ్లు పోరాటం చేసి వర్గీకరణ చట్టాన్ని సాధించుకోవడం జరిగింది. అటువంటి వర్గీకరణ ద్వారా వచ్చే ప్రతి అవకాశాన్ని మాదిగ విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత చదువులు, ఉద్యోగాలు పొందాలని విజ్ఞప్తి చెయ్యడం జరిగింది. అలాగే జూలై 7 నాడు ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని వనపర్తి జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా నూతన జెండా గద్దె నిర్మాణం చేసుకొని ఎమ్మార్పీఎస్ జెండాను జూలై 7 న జెండా ఆవిష్కరణలు ఘనంగా నిర్వహించు కోవాలని తెలియపరచడం జరిగింది.ఈ కార్యక్రమంలో వి హెచ్ పి ఎస్ నాయకులు గంధం లక్ష్మయ్య , సుబ్రహ్మణ్యం, గంధం ఎల్లయ్య మాదిగ ఆకులోరా అంజి మాదిగ , ద్వారపోగు మద్దిలేటి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి



**మంత్రాలయం , జూలై 5,మనం న్యూస్** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లో జరిగిన పలు వివాహ వేడుకల్లో మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ముందుగా కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన మాధవరం రాజశేఖర్ వెడ్స్ ఆశ్విని ,అలాగే కోసిగి టీడీపీ మండల నాయకులు పల్లపాడు రామిరెడ్డి అన్న కుమారుడు వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు . వేడుకల్లో పాల్గొన్ని , ఆయన తో పాటు ,కోసిగి మాజీ సర్పంచ్ ముత్తురెడ్డి ,కల్లుదేవకుంట సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్న ,ఎస్ఐ మల్లికార్జున ,మంత్రాలయం పాత్రికేయులు రాఘవేంద్ర గౌడు, సాబువలి,మహబూబ్,ఈరన్న,సిద్ధు, రవి, వీరేష్. వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ శు భాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రముఖులకు పెళ్ళి పెద్దలు శాలువా కప్పి ,పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో

# రచ్చమర్రి లో ఏరువాక పౌర్ణమి వేడుకలు



**మంత్రాలయం , జూలై,5,మనం న్యూస్ ;-** మంత్రాలయం మండల పరిధిలోని రచ్చమర్రి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి గ్రామ దేవతలకు ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పిండి వంటలు చేసి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.రైతులు వృషబాలను స్నానాలు చేయించి వివిధ రకాల రంగు రంగుల ను వేసి సుందరంగా అలంకరించారు. సాయంత్రం గ్రామ చావిడి లో గ్రామ పెద్దలు సమక్షంలో వృషబాలను పారువేట ఉత్సవాలను ప్రారంభించారు. పారవేటలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ దస్తగిరిబాబు అధ్వర్యంలో మాధవరం ఎస్ఐ విజయకుమార్ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# యాదగిరిగుట్టలో శాఖహార ర్యాలీలో పాల్గొన్న రాజపేట వాసులు





రాజాపేట, **జూలై 05 ప్రభ మనం:** ప్రపంచ శాఖాహార, అహింస దినోత్సవాలను పురస్కరించుకొని యాదగిరిగుట్టలోనిర్వహించిన మెగా శాఖాహార ర్యాలీలో రాజపేట వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పాదాల దగ్గర నుండి ఈ ర్యాలీ ప్రారంభం అయింది. ప్లకార్డులు ధరించి జెండాలు చేత పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ ముందుకు నడిపించారు. శాఖాహారం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ పాటలు మాటల ద్వారా ప్రధాన వీధుల గుండా ప్రదర్శన కొనసాగగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీలో చేరారు. ధ్యాన పిరమిడ్ నిర్వాహకులు గౌటే బాలరాజు, డాక్టర్ గొట్టిపాముల వెంకటేశ్వర్లు, ఎర్ర గోకుల అంజలి, కూనూరు బిక్షపతి, కునూరు వెంకటేష్, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస పవర్ లూమ్ సొసైటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆడేపు రామకిష్టయ్య



రాజాపేట, **జూలై 05 ప్రభ మనం:** రాజాపేట శ్రీనివాస పవర్ లూమ్స్ పరస్పర సహాయ సహకార సంఘం నూతన అధ్యక్షులుగా ఆడెపు రామకిష్టయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఆడెపు శ్రీశైలం, కార్యదర్శిగా సకినాల శ్రీనివాసులు, కోశాదికారిగా పొట్టబత్తిని నరహరి,సంఘం డైరెక్టర్లు గా గొట్టిపాముల సాయిక్రిష్ణ, సకినాల ఉపెందర్, పొట్టబత్తిని నరేందర్,ఆడేపు రమాదేవి, కర్నాటి లక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆడెవు శ్రీశైలం, రాజపేట పద్మశాలి సంఘం అద్యక్షులు చిన్నం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తన ఎన్నికకు సహకరించిన సంఘ సభ్యులకు, మరియు డైరెక్టర్లకు సంఘ చైర్మన్ ఆడేపు రామకిష్టయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

# బూత్ లెవల్ ఆఫీసర్లు దగ్గరుండి సహాయం చేయాలి

రాష్ట్ర అదనపు ఓటర్ నమోదు అధికారి చిన్నయ్య



వనపర్తి బ్యూరో **జూలై 05 ప్రభ మనం:** ఎన్యూమరేషన్ ఫారంను ఎలా నింపాలో తెలియని ఓటర్లకు తప్పులు లేకుండా పూరించేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు దగ్గరుండి సహాయం చేయాలని రాష్ట్ర అదనపు ఓటర్ నమోదు అధికా చిన్నయ్య ఆదేశించారు. శనివారం రాష్ట్ర అదనపు ఓటరు నమోదు అధికారి వనపర్తి జిల్లాలో పర్యటించి బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్ల పనితీరును, జిల్లాలో ఎస్.ఐ.ఆర్ కొనసాగుతున్న ప్రక్రియను పరిశీలించారు. వనపర్తి శాసన సభ నియోజక వర్గంలో ఓటర్ జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ చేయు విషయములో వనపర్తి మున్సిపాలిటి పరిదిలోని 117,125, 158 పోలింగ్ స్టేషన్ లను సందర్శించి బూత్ లెవల్ స అధికారులు ఎన్యూమరేషన్ ( గణన ఫారం ) ఓటర్లు కు పంపిణి చేయుచున్న కార్యక్రమాన్నీ ఆకస్మికంగా తనిఖీ చేసారు. బూత్ స్థాయి అధికారులు మరియు బూత్ లెవల్ పర్యవేక్షకులు గణన ఫారం ఓటర్లు కు పంపిణి గణన ఫారం పూరించే విధానము పరిశీలించి బూత్ స్థాయి అధికారులకు, పర్యవేక్షకులకు పలు సూచనలు చేసారు, ఓటర్ చేత ఎన్యూమరేషన్ ఫారం తప్పులు లేకుండా పూరించి అట్టి ఫారంను ఎలక్షన్ కమిషన్ నిర్ణయించిన గడువు లోపల బి.ఎల్. ఒ యాప్ లో నమోదు చేయాలని ఆదేశించారు. అదేవిదముగా ఓటర్ల తో మాట్లాడి ఫారం నింపడంలో వస్తున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పూరించిన ఫారం ను ఖచ్చితంగా తిరిగి బూత్ లెవల్ ఆఫీసర్లకు ఇవ్వాలని లేనిపక్షంలో ఓటరు జాబితాలో పేరు నమోదు కాదని అవగాహన కల్పించారు. రాష్ట్ర అదనపు ఓటర్ నమోదు అధికారి చిన్నయ్య వెంట ఓటర్ల నమోదు అధికారి ఉ రాజాస్వ మండలాదికారి డి.సుబ్రమణ్యం, వనపర్తి తహసిల్దార్ రమేష్ రెడ్డి, బూత్ లెవల్ అధికారులు, ఏజెంట్లు, ఓటర్లు ఉన్నారు.

# పిట్లం లో ఆప్తుల వివాహ వేడుకల్లో పాల్గొన్న ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి





నారాయణఖేడ్ **జూలై 05 ప్రభ మనం:** సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కల్హేర్ మండల కేంద్ర ఆప్తులు పండరి గౌడ్ కుమారుని వివాహ వేడుకలు పిట్లం పట్టణంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ వేదికగా పాల్గొని కంగ్టి మండల పరిధిలోని ముర్కుంజల్ గ్రామ ఆప్తులు గుడిపల్లి కాంత రెడ్డి కుమార్తె యొక్క వివాహ వేడుకలు పిట్లం పట్టణంలోని సిటీ ఫంక్షన్ హాల్ నందు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి వారితో పాటు పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ,నర్సింహ రెడ్డి జణజ మాజీ చైర్మన్,జిత్తు రెడ్డి,తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి పర్యటనలో ఉమ్మడి మిడ్జిల్ మండలానికి ఇచ్చిన హామీలు



సలీం మహబూబ్నగర్ జడ్చర్ల మిడ్జిల్ **జూలై 05 ప్రభ మనం:** మిడ్జిల్ జూలై 05సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి మిడ్జిల్ మండలంలో కృతజ్ఞత సభ జూలై 04 న నిర్వహించడం జరిగింది. మిడ్జిల్ లో 2006 జూలై 04 న రేవంత్ రెడ్డిగ్జాజ గా గెలుపొందారు. తనన్న్గాజ గా గెలిపించిన ఉమ్మడి మిడ్జిల్ మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలుపేందుకు, ఈ కృతజ్ఞత సభ పేరుతో బహిరంగసభ నిర్వహించడం జరిగింది. ఈ సభలో కొన్ని హామీలు ఇవ్వడం జరిగింది. ఊరుకొండ దేవాలయానికి 10 కోట్లు, ఊరుకొండ ఇంటిగ్రేటెడ్ మండల్ ఆఫీస్ కు 10 కోట్ల 80 లక్షలు,జగబోయిన్ పల్లి నుండి వెల్ జాల్ రోడ్డు 1 కోటి 20 లక్షలు, మిడ్జిల్ మహిళా సమాఖ్య భవనం 65 లక్షలు, అంబేద్కర్ కళాభవనం 1 కోటి 90 లక్షలు,మహిళలకు పెట్రోల్ బంకు 1 కోటి రూపాయలు,వాడ్యాల్ చెక్ డ్యామ్ 5 కోట్ల 91 లక్షలు, వస్పుల చెక్ డ్యామ్ 8 కోట్ల 50 లక్షలు,బైరంపల్లి చెక్ డ్యామ్ 8 కోట్ల 75 లక్షలు, ఎక్వాయి పల్లి నుండి లింగంధన రోడ్డు 3 కోట్లు, లింగంపేట నుండి నల్లకుంట తండా రోడ్డు 4 కోట్ల 50 లక్షలు, నెక్కొండ నుండి బైరంపల్లి రోడ్డు 4 కోట్ల 50 లక్షలు, వల్లభురావుపల్లి నుండి వేముల రోడ్డు 10 కోట్ల 20 లక్షలు,ఉమ్మడి మిడ్జిల్ మండల 40 గ్రామాలకు ప్రతి గ్రామానికి 50 లక్షలు చొప్పున 20 కోట్లు,మొత్తం 92 కోట్ల 11 లక్షలతో ఉమ్మడి మిడ్జిల్ మండలానికి కేటాయించడం జరిగింది.

మనం TELUGU DAILY
సోమవారం 06-07-2026

## మీకు తెలియకుండానే మీ క్రెడిట్ స్కోర్ పడిపోతోందా? అసలు కారణాలు ఇవే..!




బ్యాంకులు ఒక వ్యక్తి ఆదాయం, క్రెడిట్, ఖర్చులను లెక్కించి ప్రతి వ్యక్తికి ఒక క్రెడిట్ పరిమితిని నిర్ణయిస్తాయి. ఈ పరిమితిని మించితే అది క్రెడిట్ స్కోర్‌పై నేరుగా ప్రభావం చూపుతుంది. అంటే, క్రెడిట్ స్కోర్ తగ్గడం ప్రారంభమవుతుంది. అలాగే.. ప్రజల అవసరాలను తీర్చడానికి బ్యాంకులు గృహ రుణాలు, వాహన రుణాలు, వ్యక్తిగత రుణాలు మొదలైనవి అందిస్తాయి. చాలా కుటుంబాలు ఈ రుణాలు తీసుకుని తమ అవసరాలను తీర్చుకుంటున్నాయి. మనం రుణం తీసుకోవడానికి బ్యాంకులకు వెళ్ళినప్పుడు, వారు మనల్ని అడిగే మొదటి ప్రశ్నలలో ఒకటి మన క్రెడిట్ స్కోర్. బ్యాంకుల నుండి రుణం పొందడంలో ఈ క్రెడిట్ స్కోర్ చాలా ముఖ్యమైన అంశం. అంటే ఒక వ్యక్తి తన గత రుణాలను ఎలా తిరిగి చెల్లించాడో తెలియజేసే సూచికగా ఈ క్రెడిట్ స్కోర్‌ను చూస్తారు. క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటే అతను తన గత రుణాలను సరిగ్గా తిరిగి చెల్లించలేదని అర్థం. అది ఎక్కువగా ఉంటే అతను వాటిని సరిగ్గా తిరిగి చెల్లించాడని అర్థం. అటువంటి పరిస్థితిలో మీకు తెలియకుండానే మీ క్రెడిట్ స్కోర్ తగ్గిపోతే ఏం జరుగుతుంది? అటువంటి పరిస్థితిలోనే మీరు మీ క్రెడిట్ స్కోర్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రస్తుత కాలంలో చాలా మంది తమ ఆర్థిక అవసరాల కోసం క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. క్రెడిట్ కార్డుల విషయానికి వస్తే మీరు మీ బిల్లులను సమయానికి చెల్లించాలి. ఒక్క రోజు ఆలస్యం అయినా మీ క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపుతుంది. అంటే మీ క్రెడిట్ కార్డు బిల్లును ఆలస్యంగా చెల్లించడం వల్ల మీ క్రెడిట్ స్కోరు తగ్గవచ్చు. మీకు రెండు క్రెడిట్ కార్డులు ఉంటే ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. బ్యాంకులు ఒక వ్యక్తి ఆదాయం, క్రెడిట్, ఖర్చులను లెక్కించి ప్రతి వ్యక్తికి ఒక క్రెడిట్ పరిమితిని నిర్ణయిస్తాయి. ఈ పరిమితిని మించితే అది క్రెడిట్ స్కోర్‌పై నేరుగా ప్రభావం చూపుతుంది. అంటే, క్రెడిట్ స్కోర్ తగ్గడం ప్రారంభమవుతుంది.

## టెస్లా కార్లపై ఏకంగా రూ. 9 లక్షల తగ్గింపు ఎందుకో తెలుసా?




చౌక ధరలకే అత్యాధునిక సాంకేతికత కలిగిన కార్లను అందించడం ద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవాలని టెస్లా యోచిస్తోంది. రానున్న రోజుల్లో షోరూమ్‌లలో బుకింగ్స్ భారీగా పెరిగే అవకాశం ఉందని డీలర్లు అంచనా వేస్తున్నారు. ఏదేమైనా అంతర్జాతీయ మార్కెట్లో అగ్రగామిగా ఉన్న..ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లో తన మోడల్ వై కారు ధరను ఏకంగా రూ.9 లక్షల మేర భారీగా తగ్గించింది. దేశంలో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడంతో కంపెనీ ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. భారత ఆటోమొబైల్ రంగంలో గట్టి పోటీని ఎదుర్కొనేందుకు సదరు సంస్థ తన వ్యూహాన్ని పూర్తిగా మార్చేసింది. మార్కెట్లో డిమాండ్ ఒక్కసారిగా పడిపోవడంతో ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. వినియోగదారులను ఆకర్షించేందుకు సరికొత్త ధరలతో మార్కెట్లోకి వస్తోంది.ఈ భారీ తగ్గింపుతో మోడల్ వై ప్రారంభ ధర ఇప్పుడు ప్రీమియం కొనుగోలుదారులకు మరింత అందుబాటులోకి వచ్చింది. ధరల తగ్గింపుతో పాటు భారతదేశంలో తన కార్ల శ్రేణిని కూడా టెస్లా పునర్వ్యవస్థీకరించింది. కొత్త వేరియంట్లను ప్రవేశపెడుతూ పాత వాటి స్థానంలో మార్పులు చేసింది. గత కొన్ని నెలలుగా దేశీయ మార్కెట్లో ఈ కార్ల అమ్మకాలు చాలా మందకొడిగా సాగుతున్నాయి. భారీ ధరల కారణంగా చాలా మంది వాహన ప్రియులు ఇతర కంపెనీల వైపు మొగ్గు చూపారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కంపెనీ యాజమాన్యం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. టెస్లా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దేశంలోని ఇతర లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల కంపెనీలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా టాటా, మహీంద్రా వంటి స్థానిక సంస్థలతో పాటు జర్మన్ కార్ల తయారీ సంస్థలకు ఇది గట్టి పోటీని ఇస్తుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ధరల యుద్ధం ప్రారంభం కావడం వల్ల అంతిమంగా వినియోగదారులకే ఎక్కువ లాభం చేకూరనుంది. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు క్రమంగా ఆదరణ పెరుగుతున్న తరుణంలో ఈ తగ్గింపు మార్కెట్ గమనాన్ని పూర్తిగా మార్చవచ్చు.చౌక ధరలకే అత్యాధునిక సాంకేతికత కలిగిన కార్లను అందించడం ద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవాలని టెస్లా యోచిస్తోంది. రానున్న రోజుల్లో షోరూమ్‌లలో బుకింగ్స్ భారీగా పెరిగే అవకాశం ఉందని డీలర్లు అంచనా వేస్తున్నారు. ఏదేమైనా అంతర్జాతీయ మార్కెట్లో అగ్రగామిగా ఉన్న సంస్థ భారత్‌లో పట్టు సాధించేందుకు ఇంతలా తగ్గడం ఇదే మొదటిసారి. ఈ కొత్త ధరలు నేటి నుంచే అమలులోకి వస్తాయని సమాచారం. మరి ఈ భారీ ఆఫర్ తో టెస్లా అనుకున్న లక్ష్యాన్ని అందుకుంటుందో లేదో చూడాలి.

## పాన్‌కార్డు ఉన్నవారికి గుడ్‌న్యూస్‌జూన్ 1 నుంచి అమల్లోకి..!




పాన్ కార్డు అనేది ఆదాయపు పన్ను శాఖ జారీ చేసే 10 అంకెల ఆల్ఫాన్యూమరిక్ నంబర్. బ్యాంక్ అకౌంట్లు తెరిచేందుకు సహా టాక్స్ చెల్లించేందుకు, ఉద్యోగం కోసం, ఇతర చాలా ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డు అనేది తప్పనిసరి. ఇది చాలా..పాన్ కార్డు విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేస్తోంది. ఈ మార్పులు జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే శుభవార్త ఏమిటంటే ఒకే రోజులో రూ.50,000 కంటే ఎక్కువ నగదు జమ చేయడానికి ఇకపై పాన్ కార్డు అవసరం లేదు. దానికి బదులుగా, ఒక ఆర్థిక సంవత్సరంలో మీ అన్ని బ్యాంకు ఖాతాల నుండి చేసే మొత్తం నగదు డిపాజిట్లు లేదా విత్‌డ్రాయల్స్ రూ.10 లక్షలు దాటితే మాత్రమే మీరు మీ పాన్ కార్డును అందించాల్సి ఉంటుంది. అయితే, ఆస్తి లావాదేవీలకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేశారు. ఇప్పటి వరకు బ్యాంకు అకౌంట్‌లో రూ.50 వేలు డిపాజిట్ చేసినట్లయితే పాన్ కార్డు ఇవ్వాల్సి ఉండేది. ఇక నుంచి ఆ ఇబ్బంది ఉండదు. అంతేకాకుండా, ఆస్తి కొనుగోళ్లు, అమ్మకాల కోసం పాన్ పరిమితిని రూ.10 లక్షల నుండి రూ.20 లక్షలకు పెంచారు. అయితే, సంవత్సరానికి రూ.10 లక్షలు మించిన నగదు ఉపసంహరణలకు, రూ.45 లక్షలు మించిన రియల్ ఎస్టేట్ లావాదేవీలకు పాన్ తప్పనిసరిగా ఉంటుంది. పాన్ లేని పక్షంలో పాత ఫారం 60కి బదులుగా ఇప్పుడు కొత్త ఫారం 97 అవసరం అవుతుంది. పాన్ కార్డు అనేది ఆదాయపు పన్ను శాఖ జారీ చేసే 10 అంకెల ఆల్ఫాన్యూమరిక్ నంబర్. బ్యాంక్ అకౌంట్లు తెరిచేందుకు సహా టాక్స్ చెల్లించేందుకు, ఉద్యోగం కోసం, ఇతర చాలా ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డు అనేది తప్పనిసరి. ఇది చాలా ముఖ్యమైన గుర్తింపు పత్రం. కొన్ని చిన్న చిన్న లావాదేవీల్లో పాన్ అవసరం నిబంధనల్ని సడలిస్తూనే ఇదే సమయంలో కొన్ని భారీ విలువ కలిగినటువంటి ఇన్సూరెన్స్ ప్రీమియంలు, ప్రాపర్టీ డీల్స్, ఈవెంట్ పేమెంట్స్ వంటి అంశాలపై పర్యవేక్షణ మరింత కఠినతరం చేసింది. ఇంకా ముఖ్యంగా గతంలో పాన్ కార్డు లేకపోయినా ఫారం-60 ద్వారా కొన్ని లావాదేవీలు చేసుకోవడానికి వీలుండేది. ఇప్పుడు దీని బదులుగా కొత్తగా ఫారం-97 ప్రవేశపెట్టారు.

## ముఖేష్ అంబానీ సాలరీ ఎంతో తెలుసా? ఆయన ఎంత సంపాదిస్తారో తెలిస్తే షాకవుతారు!




అంబానీ ముగ్గురు పిల్లలు, ఇషా, ఆకాష్, అనంత్, అక్టోబర్ 2023లో డైరెక్టర్ల బోర్డులోకి ప్రవేశించారు. అయితే దీనికి గాను వారికి ఎలాంటి జీతం చెల్లించలేదు. వారికి కేవలం సమావేశ రుసుములు, లాభాలపై కమీషన్ మాత్రమే చెల్లించారు. ఆకాష్, ఇషా.. ఆసియాలోనే అత్యంత ధనవంతుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అయిన ముఖేష్ అంబానీ ఈ ఏడాది తన కంపెనీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదట. ముఖేష్ అంబానీ జీతంగా ఒక్క రూపాయి కూడా తీసుకోకపోవడం ఇది వరుసగా ఆరో సంవత్సరం. కంపెనీ వార్షిక నివేదిక ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ముఖేష్ అంబానీ జీతం, అలవెన్సులు, సౌకర్యాలు, పదవీ విరమణ ప్రయోజనాల రూపంలో ఎలాంటి మొత్తాన్ని స్వీకరించలేదు. ముఖేష్ అంబానీకి డివిడెండ్లే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నాయి. గతంలో ముఖేష్ అంబానీ 2008-09 ఆర్థిక సంవత్సరం నుండి 2019-20 వరకు తన వార్షిక పారితోషికాన్ని రూ. 15 కోట్లకు పరిమితం చేసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన 2020-21 ఆర్థిక సంవత్సరంలో కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఆయన జీతం తీసుకోలేదు.

**చివరకు ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారు?**

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముఖేష్ అంబానీ, కంపెనీ, దాని మొత్తం వ్యాపారం పూర్తి ఆదాయ సామర్థ్యానికి తిరిగి వచ్చే వరకు జీతం తీసుకోకూడదని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఈ నిర్ణయాన్ని పూర్తిగా స్వచ్ఛందంగా తీసుకున్నారట. అలాగే ఇది 2021-22, 2022-23, 2023-24, 2024-25, ఇప్పుడు 2025-26 ఆర్థిక సంవత్సరాలలో కూడా కొనసాగుతుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 95,754 కోట్ల అత్యధిక లాభాన్ని ఆర్జించింది. అలాగే కంపెనీ మార్కెట్ విలువ రూ.18.19 లక్షల కోట్లుగా నిలిచింది.

**రూ. 9.66 కోట్ల డివిడెండ్ ఆదాయం:**

సుమారు 100 బిలియన్ డాలర్ల నికర సంపదతో ప్రపంచంలో 21వ అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీ, డివిడెండ్ల ద్వారా సంపాదిస్తున్నారు. రిలయన్స్‌లో ఆయనకు నేరుగా ఉన్న 1.61 కోట్ల షేర్ల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన ఒక్కో షేరుకు రూ.6 డివిడెండ్ ఆధారంగా ఆయనకు రూ.9.66 కోట్ల డివిడెండ్ ఆదాయం లభించింది. అంబానీ కజిన్స్ అయిన నిఖిల్, హితల్ మెస్వానీల పారితోషికం చెరో రూ.25 కోట్లుగా స్థిరంగా ఉంది. ఇందులో జీతం, అలవెన్సులు, పదవీ విరమణ ప్రయోజనాలు, లాభాల కమీషన్ ఉన్నాయి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.ఎం.ఎస్. ప్రసాద్ పారితోషికం 2024-25లో రూ.19.96 కోట్ల నుండి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.20.58 కోట్లకు పెరిగింది.

**పిల్లలకు కూడా జీతాలు లేవు:**

అంబానీ ముగ్గురు పిల్లలు, ఇషా, ఆకాష్, అనంత్, అక్టోబర్ 2023లో డైరెక్టర్ల బోర్డులోకి ప్రవేశించారు. అయితే దీనికి గాను వారికి ఎలాంటి జీతం చెల్లించలేదు. వారికి కేవలం సమావేశ రుసుములు, లాభాలపై కమీషన్ మాత్రమే చెల్లించారు. ఆకాష్, ఇషా రూ. 2.5 కోట్ల కమీషన్ అందుకున్నారు. అంబానీ 1977 నుండి రిలయన్స్ డైరెక్టర్ల బోర్డులో ఉన్నారు. జూలై 2002లో గ్రూప్ వ్యవస్థాపకుడు ధీరూభాయ్ అంబానీ మరణానంతరం ఆయనను కంపెనీ ఛైర్మన్‌గా నియమించారు. 2023 సంవత్సరంలో ఏప్రిల్ 2029 వరకు ఐదేళ్ల కాలానికి ఆయనను రిలయన్స్ అధిపతిగా తిరిగి నియమించారు. ఈ కాలంలో కూడా ఆయన జీతం తీసుకోకూడదని నిర్ణయించుకున్నారు.

## స్లీపర్ టికెట్‌తో ఏసీ కోచ్‌లో ప్రయాణం.. ఈ ప్రత్యేక రైల్వే సౌకర్యం గురించి మీకు తెలుసా?

భారతీయ రైల్వే నియమాల ప్రకారం.. ప్రయాణికులు తమ టిక్కెట్ తరగతికి సంబంధించిన కోచ్‌లోనే ప్రయాణించాలి. టిటిఇ మీ టిక్కెట్‌ను అప్‌గ్రేడ్ చేసే వరకు మీరు మీ కోచ్‌లోనే ఉండాలి. టిటిఈ స్లీపర్, ఏసీ మధ్య ఉన్న ఛార్జీని వసూలు.. ఉష్ణోగ్రతలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైలులో ముఖ్యంగా స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించడం నిజంగా ఒక సవాలు. అయితే స్లీపర్ క్లాస్ టిక్కెట్‌తో ఏసీలో ప్రయాణించే అవకాశాన్ని రైల్వే మీకు అందిస్తోందని చెబితే మీరు నమ్మలేకపోవచ్చు. ఇది అక్షరాలా నిజం. మీరు కొన్ని అర్హతలను కలిగి ఉంటే ఈ రైల్వే సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ మండుటెండలో రైలు ప్రయాణికులకు ఈ సౌకర్యం ఒక పెద్ద ఊరట. ప్రస్తుతం వేసవి సెలవులు కూడా కొనసాగుతున్నాయి. దీంతో చాలా మంది ప్రయాణాలు ప్రారంభించడానికి ఇది సరైన సమయం.అయితే, ఏసీ క్లాస్ రైలు టిక్కెట్లు దొరకనప్పుడు సమస్య తలెత్తుతుంది. ముఖ్యంగా వేసవిలో ఏసీ క్లాస్ టిక్కెట్లు త్వరగా అమ్ముడైపోతాయి. అలాగే కుటుంబంతో స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించడం చాలా కష్టం. స్లీపర్ క్లాస్ టిక్కెట్టుతో ఏసీ సీట్లు లభిస్తాయా లేదా అనేదే మనసులో మెదిలే ఏకైక ప్రశ్న. ఈ విషయానికి సంబంధించి రైల్వే అధికారులు కొన్ని అనుకూలమైన నిబంధనలను పేర్కొన్నారు.



**షరతులకు లోబడి మీరు ఏసీలో ప్రయాణించవచ్చు:**

మీ వద్ద స్లీపర్ క్లాస్ టికెట్ ఉన్నప్పటికీ, మీరు ఏసీలో ప్రయాణించవచ్చని ఒక రైల్వే అధికారి వివరించారు. దీని కోసం మీరు టీటీఈతో మాట్లాడవచ్చు. కానీ ఖాళీ సీట్లు ఉంటేనే మీకు ఏసీ సీటు కేటాయిస్తారు. ఏసీ కోచ్‌లో ఖాళీ సీట్లు ఉంటే టీటీఈ మీ టికెట్‌ను అప్‌గ్రేడ్ చేయగలరు. అలాగే ఛార్జీలలోని వ్యత్యాసాన్ని చెల్లించిన తర్వాత మీరు స్లీపర్ క్లాస్ నుండి ఏసీకి ప్రయాణించడానికి అర్హత పొందవచ్చు. అయితే, ఏసీ కోచ్ అప్పటికే నిండిపోయి ఉంటే మీరు మీ టికెట్‌ను అప్‌గ్రేడ్ చేసుకోలేరు. ఉదాహరణకు స్లీపర్ క్లాస్ ఛార్జీ రూ.400, ఏసీ ఛార్జీ రూ.1,200 అయితే, మీ టికెట్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవడానికి మీరు వ్యత్యాసం అంటే రూ.800 చెల్లించాల్సి ఉంటుంది.

**అడగకుండా ఎక్కితే ఏమవుతుంది?**

ఒక రైల్వే అధికారి వివరించిన దాని ప్రకారం, టీటీఈ మీ టిక్కెట్టును అప్‌గ్రేడ్ చేసి మిమ్మల్ని ఏసీ కోచ్ ఎక్కడానికి అనుమతించినప్పటికీ, మీరు టీటీఈని సంప్రదించకుండా ఏసీ కోచ్‌లో ప్రయాణించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవచ్చు. అటువంటి సందర్భంలో టీటీఈ ప్రయాణికుడి నుండి ఛార్జీల వ్యత్యాసాన్ని వసూలు చేయడమే కాకుండా, జరిమానా కూడా విధించవచ్చు. అయితే, ప్రయాణికుడు కోచ్ ఎక్కడానికి సరైన కారణం చూపిస్తే, జరిమానా విధించకుండా వారిని తర్వాతి స్టేషన్‌లో స్లీపర్ కోచ్‌కి వెనక్కి పంపవచ్చు.

**రైల్వే నియమం ఏమి చెబుతోంది?**

భారతీయ రైల్వే నియమాల ప్రకారం.. ప్రయాణికులు తమ టిక్కెట్ తరగతికి సంబంధించిన కోచ్‌లోనే ప్రయాణించాలి. టిటిఇ మీ టిక్కెట్‌ను అప్‌గ్రేడ్ చేసే వరకు మీరు మీ కోచ్‌లోనే ఉండాలి. టిటిఈ స్లీపర్, ఏసీ మధ్య ఉన్న ఛార్జీని వసూలు చేసి, మీ టిక్కెట్‌ను అప్‌గ్రేడ్ చేసిన తర్వాత మాత్రమే మీరు మీ కోచ్ నుండి ఏసీకి మారవచ్చు. రైల్వే నియమాల ప్రకారం.. టీటీఈ అనుమతి లేకుండా అలా చేస్తే, అదనపు ఛార్జీతో పాటు జరిమానా కూడా విధిస్తారు.

## మీ భార్య పేరు మీద పోస్టాఫీసులో రూ. లక్ష డిపాజిట్ చేస్తే రెండేళ్లకు ఎంత వస్తుంది?








ప్రస్తుతం ఎఫ్‌డిలు చాలా ప్రజాదరణ పొందిన పెట్టుబడిగా పరిగణిస్తారు. అందువల్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు బ్యాంకును బట్టి మారుతూ ఉంటాయి. మీరు పోస్ట్రాశీర్ రాటటఅఎవ: ఆఫీసులలో కూడా దీన్ని చేయవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును తగ్గించినందున..

క్రమమైన పెట్టుబడులు దీర్ఘకాలంలో మంచి రాబడిని ఇస్తాయి. ప్రస్తుతం మార్కెట్లో అనేక పెట్టుబడి ఎంపికలు ఉన్నాయి. కానీ వాటిలో నష్టభయం కూడా ఉంది. అయితే ప్రభుత్వ పథకాలు, బాండ్లు, బ్యాంకు డిపాజిట్ పథకాలు మొదలైన పెట్టుబడులు హామీతో కూడిన రాబడిని అందిస్తాయి. వీటిలో నష్టభయం తక్కువగా ఉంటుందని అంటారు.

**1 / 5**

సాధారణంగా మనం బ్యాంకు డిపాజిట్ పథకాల గురించి ఆలోచించినప్పుడు మనకు మొదటగా గుర్తుకువచ్చేది ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలే. ప్రస్తుతం, బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలపై చాలా మంచి వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. అదేవిధంగా సాధారణ ప్రజలతో పోలిస్తే సీనియర్ సిటిజన్ల కోసం ఉద్దేశించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలపై వడ్డీ రేట్లు ఎక్కువగా ఉంటాయి. మీరు కోరుకుంటే మీ కుటుంబంలోని వృద్ధుల పేరు మీద కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు.

**2 / 5**


ప్రస్తుతం ఎఫ్‌డిలు చాలా ప్రజాదరణ పొందిన పెట్టుబడిగా పరిగణిస్తారు. అందువల్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు బ్యాంకును బట్టి మారుతూ ఉంటాయి. మీరు పోస్ట్ ఆఫీసులలో కూడా దీన్ని




చేయవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును తగ్గించినందున, దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకులు తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను తగ్గించాయి. మరోవైపు పోస్ట్ ఆఫీస్ తన వినియోగదారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అదే అధిక వడ్డీ రేటును అందిస్తూనే ఉంది. ఈ పరిస్థితిలో ఒక వ్యక్తి తన భార్య పేరు మీద రూ.1 లక్ష ఎఫ్‌డి తెరిస్తే, 24 నెలల తర్వాత అతనికి ఎంత డబ్బు వస్తుందో ఇప్పుడు చూద్దాం.

**3 / 5**

ఆ విధంగా మీరు పోస్ట్ ఆఫీసులో 1 నుండి 5 సంవత్సరాల కాలపరిమితికి ఎఫ్‌డీ ఖాతాను తెరవవచ్చు. వీటిని టైమ్ డిపాజిట్లు అని కూడా అంటారు. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మాదిరిగానే టీడీలు కూడా ఒక నిర్దిష్ట కాలానికి హామీతో కూడిన స్థిర ఆదాయాన్ని అందిస్తాయి. పోస్ట్ ఆఫీసు తన వినియోగదారులకు 1 సంవత్సరం, 2 సంవత్సరాలు, 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల కాలపరిమితితో టీడీ ఖాతాలను తెరిచే అవకాశాన్ని అందిస్తుంది. పోస్ట్ ఆఫీసు 1-



సంవత్సరం టీడీలకు 6.9 శాతం, 2-సంవత్సరాల టీడీలకు 7.0 శాతం, 3-సంవత్సరాల టీడీలకు 7.1 శాతం, 5 సంవత్సరాల టీడీలకు 7.5 శాతం వడ్డీ రేట్లను అందిస్తుంది. పోస్ట్ ఆఫీసు టీడీ ఖాతాలో కనీస డిపాజిట్ రూ.1,000. దీనికి గరిష్ట పరిమితి లేదు.

**4 / 5**

మీరు రూ.1,00,000 డిపాజిట్ చేస్తే మీకు ఎంత వస్తుంది? పోస్ట్ ఆఫీస్ పథకాలు పురుషులు, మహిళలు లేదా సీనియర్ సిటిజన్లు అనే తేడా లేకుండా వినియోగదారులందరికీ ఒకే రాబడిని అందిస్తాయి. పోస్ట్ ఆఫీస్ టీడీ పథకంలో వినియోగదారులందరికీ ఒకే వడ్డీ రేటు లభిస్తుంది. అయితే, ఒక వ్యక్తి పోస్ట్ ఆఫీస్‌లో తన భార్య పేరు మీద రూ. 1,00,000ను 24 నెలల (2 సంవత్సరాల) కాలానికి టీడీలో పెట్టుబడి పెడితే, మెచ్యూరిటీ తర్వాత అతనికి మొత్తం రూ. 1,14,888 లభిస్తుంది. ఇందులో కేవలం రూ.14,888 మాత్రమే వడ్డీగా వస్తుంది. ఈ పథకం ఎటువంటి నష్టాలు లేకుండా హామీతో కూడిన స్థిర వడ్డీ రేటును కూడా అందిస్తుంది.

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com